తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
ఆదివారం
23 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 314
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# లివర్‌పూల్‌తో తెలంగాణ దోస్తీ

- పెట్టుబడులు, టెక్నాలజీ, క్రీడలు.. సృజనాత్మక రంగాల్లో భాగస్వామ్యానికి ఆసక్తి
- అక్టోబర్‌లో హైదరాబాద్‌కు లివర్‌పూల్ బృందం



లండన్, ఆగస్టు 22 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకునేందుకు బ్రిటన్‌లోని లివర్‌పూల్ నగరం ఆసక్తి వ్యక్తం చేసింది. లివర్‌పూల్ నగర అభివృద్ధి విభాగ కార్పొరేట్ డైరెక్టర్లు సుసాన్ ఫిన్నెగన్, నువాలా గల్లాఘర్ తమ సహచరులతో కలిసి లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ--లివర్‌పూల్ మధ్య భవిష్యత్ సహకార అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.

### కీలక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ

జీవశాస్త్ర పరిశ్రమలు, సాంకేతిక రంగం, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో పరస్పర సహకారంపై ఇరుపక్షాలు చర్చించాయి. తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక, సాంకేతిక వాతావరణం లివర్‌పూల్ ప్రతినిధులను ఆకట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. పెట్టుబడులు, నైపుణ్యాల మార్పిడి, సంయుక్త కార్యక్రమాల అమలుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు.

### బయో,మెడికల్ టెక్నాలజీపై ఫోకస్

జీవశాస్త్ర పరిశోధనలు, వైద్య సాంకేతికత, ఔషధ తయారీ రంగాల్లో సహకారాన్ని పెంచుకునే అంశంపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఐటీ రంగంలో ఆవిష్కరణలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, యువతకు ➢ మిగతా 2వ పేజిలో..



# నీట్ కలను చిదిమేసిన కిరాతకం!

- నీట్ అభ్యర్థిని దారుణ హత్య
- పెళ్లి నిశ్చయమైన తర్వాత వేధింపులు.. ప్రియుడి గదిలోనే యువతి మృతి
- వివాహం అడ్డుకునేందుకే కుట్ర? ప్రియుడిపై కుటుంబ సభ్యుల ఆరోపణలు
- బాత్రూంలో కుళ్లిన స్థితిలో మృతదేహం.. పరారీలో నిందితుడు

వారణాసి, ఆగస్టు 22 (తరంగాలు ప్రతినిధి): ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ యువతి దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. ఆగస్టు 18న కళాశాలకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన యువతి ఆ తర్వాత కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.యువతి మొబైల్ ఫోన్ సిగ్నల్ల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా, చివరిసారిగా ఆమె ఫోన్ మాలవీయ ఇంటర్ కాలేజీ పరిసరాల్లో పనిచేసినట్లు గుర్తించారు. ఇదే సమయంలో కుటుంబ సభ్యులు స్వయంగా ఆచూకీ కోసం ➢ మిగతా 2వ పేజిలో..

# జిల్లా ఆసుపత్రులను సూపర్ వైద్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలి



- మేజర్ శస్త్రచికిత్సలు చేసే స్థాయికి అభివృద్ధి
- అవసరం లేకుండా రోగులను రిఫర్ చేయొద్దని ఆదేశం
- కొత్త సీటీ స్కాన్లు, పరికరాల ఏర్పాటుకు చర్యలు
- నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- మంత్రి దామోదర రాజనర్సింహా

2వ పేజిలో..



# ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

- నర్మెట ఫ్యాక్టరీని సందర్శించిన మాజీ మంత్రులు
- 60 వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్‌పై హర్షం
- రిఫైనరీ పనులు వెంటనే ప్రారంభించాలని సూచన
- మరింత మంది రైతులు ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టాలని పిలుపు

➢ 2వ పేజిలో..



# 10 నిమిషాల్లో వెర్సోవా--మధ్ ప్రయాణం

- రూ.2,395 కోట్లతో భారీ వంతెన
- ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- 2029 నాటికి అందుబాటులోకి లక్ష్యం
- నాలుగు లేన్లతో ఆధునిక నిర్మాణం

➢ 2వ పేజిలో..



# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

- కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ దోస్తీ.. హైదరాబాద్‌కు గ్లోబల్ ఖ్యాతి!
- ప్రపంచ స్థాయి విద్యా సంస్థలకు తెలంగాణ ఆహ్వానం
- విద్యావేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కీలక సమావేశం

లండన్, ఆగస్టు 22 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణను ప్రపంచ స్థాయి జ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. తెలంగాణ రైజింగ్ అధికారిక ప్రతినిధి బృందం లండన్ పర్యటనలో భాగంగా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యావేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కీలక సమావేశం నిర్వహించింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా.. పరిశోధన రంగాల్లో భాగస్వామ్యానికి ఆహ్వానం

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి విద్యా, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికలను ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించింది. తెలంగాణలో అందుబాటులో ➢ మిగతా 2వ పేజిలో..




# భారత్ అభివృద్ధికి సంస్కరణలే బలం

- ప్రపంచ ఆశాకిరణంగా భారత్: ప్రధాని
- వరల్డ్ లీడర్స్ ఫోరంలో కీలక ప్రసంగం
- ఉత్పత్తి పెంపునకు ప్రోత్సాహక విధానాలు
- స్థిరత్వమే దేశ ప్రగతికి పునాది

➢ 2వ పేజిలో..

# ఏడంతస్తుల భవనం కుప్పకూలి..ఇద్దరు మృతి

- అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మానాలు తొలగిస్తాం
- అక్రమ నిర్మాణాదారులను ఎవ్వరినీ వదలం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ




హైదరాబాద్,ఆగస్ట్22 అంజయ్యనగర్‌లోని అక్రమ నిర్మాణాలన్నీ తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఘటనాస్థలి పక్కన ➢ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక

తరంగాలు

THARANGALU DAILY NEWS

ఆదివారం, 23 ఆగస్టు , 2026



# నీట్ కలను చిదిమేసిన కిరాతకం!

వెతుకుతుండగా మీర్జాపూర్ జిల్లాలోని సీఖర్ గ్రామంలో నిందితుడు వివేక్ చౌబే మేనమామ ఇంట్లో యువతికి చెందిన బ్యాగ్ లభించింది.

బ్యాగ్‌లో దొరికిన తాళం చెవితో నిందితుడు అద్దెకు ఉంటున్న గదిని పరిశీలించగా బాత్రూంలో దుర్వాసన వచ్చింది. తలుపు తెరిచి చూడగా యువతి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

### గొంతు కోయడంతో మృతి

పోస్టుమార్టం నివేదిక ప్రకారం యువతి గొంతుకు గాయాల కారణంగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తలపై కూడా గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం లభించిన పరిస్థితులపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. లైంగిక దాడి జరిగిందా అనే అంశంపై ఫోరెన్సిక్ పరీక్షలు కొనసాగుతున్నాయి.

### వివాహం నిశ్చయమైన తర్వాత బెదిరింపులు?

కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం వివేక్ చౌబే కొంతకాలంగా యువతిని వేధిస్తున్నాడు. ఆమె మరో వ్యక్తిని వివాహం చేసుకుంటే మార్ఫింగ్ చేసిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తానని బెదిరించినట్లు వారు ఆరోపించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 22న యువతికి మరో యువకుడితో వివాహం నిశ్చయమైన నేపథ్యంలోనే నిందితుడి వైఖరిలో మార్పు వచ్చిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

నీట్ పరీక్షకు సంబంధించిన సహాయం చేస్తానని నమ్మించి యువతిని తన గదికి పిలిపించి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు హత్యకు గల పూర్తి కారణాలు స్పష్టంగా తెలియాల్సి ఉంది.

# జిల్లా ఆసుపత్రులను సూపర్ వైద్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

హైదరాబాద్, ఆగస్టు 22 : రాష్ట్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులను మేజర్ శస్త్రచికిత్సలు కూడా నిర్వహించగల పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రజలకు తమ ప్రాంతాల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా జిల్లా, ఏరియా ఆసుపత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఈ మేరకు కీలక సూచనలు చేశారు. టీచింగ్ ఆసుపత్రులతో సమానంగా జిల్లా, ఏరియా ఆసుపత్రులు కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించే స్థాయికి చేరుకోవాలని మంత్రి అన్నారు. ఇటీవల టీచింగ్ ఆసుపత్రుల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేసినట్లు గుర్తుచేసిన ఆయన, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించినట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బందితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలు కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు.

చిన్నచిన్న సమస్యలకు కూడా రోగులను పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేయడం వల్ల ప్రజలకు అనవసర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా చికిత్స అందించే అవకాశం ఉన్నప్పటికీ రోగులను పైస్థాయి ఆసుపత్రులకు పంపడం వల్ల వారి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే రిఫర్ చేయాలని, అలాంటి సందర్భాల్లో కూడా ముందుగానే సంబంధిత ఆసుపత్రులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రోగులకు స్థానికంగానే మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత పెంచేందుకు అవసరమైన చోట కొత్త సీటీ స్కాన్లు, డయాగ్నస్టిక్ పరికరాలు, ఇతర ఆధునిక వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. పరికరాల కోసం ప్రతిపాదనలు పంపేటప్పుడు రోగుల సంఖ్య, అవసరాలు, వినియోగ సామర్థ్యం వంటి అంశాలను స్పష్టంగా వివరించాలని చెప్పారు. కేవలం డిమాండ్ ఆధారంగా కాకుండా శాస్త్రీయ విశ్లేషణతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లు వారానికి కనీసం ఒకరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా, రోగులకు సరైన చికిత్స అందుతోందా, పరికరాలు పనిచేస్తున్నాయా, మందుల కొరత ఉందా వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. పరిశుభ్రత, తాగునీటి సరఫరా, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి నెల తమ తనిఖీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరు కావడం, ముందుగానే ఆసుపత్రి నుంచి వెళ్లిపోవడం, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని మంత్రి హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి వెంటనే పరిష్కరించాలని, స్థానికంగా పరిష్కరించగల సమస్యలను పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే దిశగా ప్రతి అధికారి, ప్రతి వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు.

# 10 నిమిషాల్లో వెర్సోవా--మఢ్ ప్రయాణం

ముంబై, ఆగస్టు 22 : ముంబై మహానగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి ప్రయాణ సమయాన్ని గణనీయంగా ఆదా చేయాలనే లక్ష్యంతో బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) మరో కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. వెర్సోవా, మఢ్ ఐలాండ్ ప్రాంతాలను కలుపుతూ మలాడ్ క్రీక్‌పై రూ. 2,395 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక కేబుల్-స్టేయ్డ్ వంతెన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ప్రస్తుతం గంట నుంచి గంటన్నర వరకు పడుతున్న ప్రయాణ సమయం కేవలం 10 నిమిషాలకు తగ్గనుంది. ప్రస్తుతం వెర్సోవా, మఢ్ ఐలాండ్ మధ్య ప్రత్యక్ష రహదారి మార్గం లేకపోవడంతో ప్రయాణికులు 18 నుంచి 20 కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ట్రాఫిక్ పరిస్థితులను బట్టి ఈ ప్రయాణానికి 60 నుంచి 90 నిమిషాల సమయం పడుతోంది. రెండు ప్రాంతాల మధ్య జెట్టీ సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ అవి ఏడాదిలో కొన్ని నెలలు మాత్రమే పనిచేయడం, వర్షాకాలంలో నిలిచిపోవడం వల్ల ప్రజలకు పూర్తిస్థాయి ప్రయోజనం కలగడం లేదు. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత వంతెన ముంబై ప్రజలకు కీలక ఉపశమనంగా మారనుంది. సుమారు 2.06 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్న ఈ వంతెనను నాలుగు లేన్లతో రూపొందించనున్నారు. భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశాలంగా నిర్మించే ఈ వంతెనలో పాదచారులు, సైక్లిస్టుల కోసం ప్రత్యేక మార్గాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. వంతెనపై ఆధునిక లైటింగ్ వ్యవస్థలు, అత్యవసర సేవల సౌకర్యాలు కల్పించనున్నారు. దీని ద్వారా కేవలం రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా మఢ్ ఐలాండ్ ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, ఇతర అత్యవసర సేవలు మరింత వేగంగా అందుబాటులోకి రానున్నాయి. ప్రాంతీయ అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రాజెక్టుకు సంబంధించి బీఎంసీ ఇప్పటికే నేల పరీక్షలు, సర్వేలు వంటి ప్రాథమిక పనులను పూర్తి చేసింది. అయితే ప్రధాన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన పర్యావరణ అనుమతులు, బాంబే హైకోర్టు తుది ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఈ అంశంపై సెప్టెంబర్‌లో కీలక విచారణ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అనుమతులు లభించిన వెంటనే వర్షాకాలం ముగిసిన తర్వాత నిర్మాణ పనులు ప్రారంభించాలని బీఎంసీ ప్రణాళిక రూపొందించింది. అన్ని ప్రక్రియలు సకాలంలో పూర్తైతే 2029 నాటికి ఈ అత్యాధునిక వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ముంబై నగర రవాణా రంగంలో మరో మైలురాయిగా నిలవనుంది.

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్



ఉన్న విద్యా, సాంకేతిక, పరిశోధనా అవకాశాలను వివరించి, ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించాలని ఆహ్వానించింది. అంతర్జాతీయ పెట్టుబడులు, విద్యా భాగస్వామ్యాలు, పరిశోధనా కేంద్రాలకు ప్రభుత్వం కల్పిస్తున్న అనుకూల వాతావరణాన్ని వివరించింది.

### హైదరాబాద్‌లో అంతర్జాతీయ కోర్సులకు అవకాశం

కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ మార్కెటింగ్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, ఫ్రూగల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహ-చైర్మన్ ప్రొఫెసర్ వెంకటేశ్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాల నిర్వహణ, అంతర్జాతీయ ప్రమాణాల కోర్సుల అందుబాటు, విద్యార్థులకు కొత్త అవకాశాల కల్పనపై చర్చించారు.

### పరిశోధన.. విద్యార్థుల మార్పిడికి ప్రాధాన్యం

విద్యతో పాటు పరిశోధన రంగంలోనూ పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు ఇరు పక్షాలు సానుకూలత వ్యక్తం చేశాయి. సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, అధ్యాపకులు--విద్యార్థుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు, సాంకేతిక ఆవిష్కరణలకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలపై చర్చలు జరిగాయి. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి పరిశోధనా అవకాశాలు మరింత చేరువ కానున్నాయి.

### స్టార్టప్‌లు.. ఇంక్యుబేషన్‌పై ప్రత్యేక దృష్టి

స్టార్టప్‌లు, వ్యవస్థాపకత, ఇంక్యుబేషన్ కేంద్రాల ఏర్పాటుపైనా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. యువ పారిశ్రామికవేత్తలకు ప్రపంచ స్థాయి మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం అందించే అవకాశాలను పరిశీలించారు. తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కేంబ్రిడ్జ్ అనుభవాన్ని వినియోగించుకోవచ్చని అభిప్రాయపడ్డారు.

### కార్యాచరణ ప్రణాళికకు నిర్ణయం

విద్యా కార్యక్రమాలు, పరిశోధన, వ్యవస్థాపకత, ఇంక్యుబేషన్ రంగాల్లో పరస్పర సహకారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. కేంబ్రిడ్జ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థతో ఏర్పడుతున్న ఈ సంబంధం హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలకు మరింత బలం చేకూర్చనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తెలంగాణను నిలబెట్టే ప్రయాణంలో కేంబ్రిడ్జ్‌తో భాగస్వామ్యం కీలక మైలురాయిగా నిలవనుంది.

# ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

సిద్దిపేట, ఆగస్టు 22 సిద్దిపేట జిల్లా నర్మెటలోని ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని మాజీ మంత్రులు హరీశ్ రావు, వి. ప్రశాంత్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ కార్యకలాపాలు, ఉత్పత్తి సామర్థ్యం, రైతులకు అందిస్తున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడిన హరీశ్ రావు, ఆయిల్‌ఫామ్ సాగు రైతులకు లాభదాయకమైన పంటగా నిలుస్తోందని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో స్థిరమైన ఆదాయం అందించే ఈ పంటను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం జలాల అందుబాటుతో సిద్దిపేట ప్రాంతంలో ఆయిల్‌ఫామ్ సాగుకు నాంది పలికిన విషయాన్ని హరీశ్ రావు గుర్తు చేశారు. సాగునీటి సౌకర్యాలు పెరగడంతో రైతులు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల వైపు అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఆయిల్‌ఫామ్ సాగు ద్వారా రైతుల ఆదాయంలో గణనీయమైన పెరుగుదల నమోదవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌ఫామ్ విస్తరణకు గతంలో తీసుకున్న చర్యలు ఇప్పుడు ఫలితాల రూపంలో కనిపిస్తున్నాయని అన్నారు. నర్మెట ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ అనతికాలంలోనే 60 వేల మెట్రిక్ టన్నుల క్రషింగ్ పూర్తి చేయడం గొప్ప విజయమని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. ఇది ఫ్యాక్టరీ సామర్థ్యానికి, రైతుల సహకారానికి నిదర్శనమని చెప్పారు. రైతులు పండించిన పంటకు మార్కెట్ భరోసా కల్పించడంలో ఫ్యాక్టరీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ విజయంతో మరింత మంది రైతులు ఆయిల్‌ఫామ్ సాగుపై ఆసక్తి చూపే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌ఫెడ్ అధికారులు రిఫైనరీ పనులను వెంటనే ప్రారంభించాలని హరీశ్ రావు సూచించారు. రిఫైనరీ అందుబాటులోకి వస్తే విలువ ఆధారిత ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. అలాగే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆయిల్‌ఫామ్ మొక్కలను రైతులకు వేగంగా పంపిణీ చేసి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. కొత్తగా సాగు చేపట్టే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు.

రైతులకు సాంకేతిక సహాయం అందించడం కూడా అత్యంత ముఖ్యమని హరీశ్ రావు పేర్కొన్నారు. సాగులో ఎదురయ్యే సమస్యలపై ఎప్పటికప్పుడు మార్గదర్శకత్వం ఇవ్వాలని, వ్యవసాయ నిపుణులు, ఫ్యాక్టరీ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. పంట నిర్వహణ, దిగుబడి పెంపు, వ్యాధి నివారణ వంటి అంశాల్లో రైతులకు నిరంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రైతులకు లాభదాయకమైన పంటలను ప్రోత్సహించి వారి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని హరీశ్ రావు పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం, అధికారులు, రైతులు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. నర్మెట ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్‌ఫామ్ రంగానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

# లివర్‌పూల్‌తో తెలంగాణ దోస్తీ

ఉపాధి అవకాశాల కల్పనపైనా ఇరుపక్షాలు అభిప్రాయాలు పంచుకున్నాయి.

### క్రీడలు.. క్రియేటివ్ ఎకానమీకి ప్రాధాన్యం

క్రీడా రంగంలో ప్రతిభావంతులను తీర్చిదిద్దడం, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. సినిమా, డిజిటల్ మీడియా, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి సంయుక్తంగా పనిచేసే అవకాశాలను కూడా పరిశీలించారు.

### అక్టోబర్‌లో హైదరాబాద్‌కు లివర్‌పూల్ బృందం

తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో విదేశీ నగరాలు, సంస్థలతో భాగస్వామ్యాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో లివర్‌పూల్‌తో ప్రతిపాదిత భాగస్వామ్యం పరిశ్రమలు, విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాలకు కొత్త అవకాశాలను తెరవగలదని అధికారులు భావిస్తున్నారు.

భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేసేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శించనుంది. ఈ పర్యటనలో పరస్పర అవగాహన ఒప్పందాలు, సంయుక్త కార్యాచరణ ప్రణాళికలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణ--లివర్‌పూల్ భాగస్వామ్యం పెట్టుబడులు, సాంకేతికత, నైపుణ్యాలు, క్రీడలు, సృజనాత్మక రంగాల్లో రెండు ప్రాంతాలకు కొత్త అవకాశాలకు దారి తీస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# భారత్ అభివృద్ధికి సంస్కరణలే బలం

న్యూఢిల్లీ, ఆగస్టు 22 : ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అభివృద్ధి, ఆశలకు ప్రతీకగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం--2026లో ప్రసంగించిన ఆయన, ప్రపంచం నేడు భారత్‌ను వృద్ధి, అవకాశాలు, స్థిరత్వానికి కేంద్రంగా చూస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం వేగవంతమైన సంస్కరణలను అమలు చేస్తోందని చెప్పారు. విధాన పరమైన మార్పులతో పాటు పాలనా వ్యవస్థలో కూడా తదుపరి తరం సంస్కరణలను చేపడుతున్నామని ప్రధాని తెలిపారు. గతంలో ఉత్పత్తి పెంచిన సంస్థలను శిక్షించే విధానాలు ఉండేవని, ప్రస్తుతం ఉత్పత్తి పెంపునకు ప్రోత్సాహకాలు అందించే వ్యవస్థను అమలు చేస్తున్నామని వివరించారు. లైసెన్స్ రాజ్ కాలంలోని పరిమితుల నుంచి బయటపడి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే దిశగా దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని మోదీ చెప్పారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, డిజిటల్ వ్యవస్థలు, రక్షణ ఉత్పత్తి వంటి రంగాల్లో సాధించిన పురోగతి దేశ ఆర్థిక శక్తిని మరింత బలోపేతం చేసిందన్నారు. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలు దేశీయ తయారీ రంగానికి కొత్త ఊపునిచ్చాయని వివరించారు. దేశంలో రాజకీయ స్థిరత్వం, విధానాల కొనసాగింపే పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతున్న ప్రధాన అంశాలని ప్రధాని పేర్కొన్నారు. స్థిరమైన ప్రభుత్వం, స్పష్టమైన విధానాలతో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోందని చెప్పారు. సురక్షితమైన, స్థిరమైన భారత్ ప్రపంచ స్థిరత్వానికి కూడా దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ సవాళ్ల మధ్య కూడా భారత్ అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగిస్తోందని ప్రధాని తెలిపారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, సాంకేతిక వినియోగం ద్వారా సమగ్ర అభివృద్ధి లక్ష్యాన్ని సాధిస్తున్నామని చెప్పారు. దేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే దిశగా సంస్కరణల వేగం మరింత పెరుగుతుందని స్పష్టం చేశారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం ప్రపంచ వ్యాప్తంగా విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు పాల్గొనే ప్రతిష్ఠాత్మక వేదికగా గుర్తింపు పొందింది. ఈ వేదికపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు భారత్ ఆర్థిక భవిష్యత్తు, పెట్టుబడుల అవకాశాలు, సంస్కరణల దిశపై అంతర్జాతీయ వర్గాల దృష్టిని ఆకర్షించాయి.

# ఏడంతస్తుల భవనం కుప్పకూలి..ఇద్దరు మృతి

భవనాల వారు ఖాళీ చేసి వెళ్లాలని రంగనాథ్ ఆదేశించారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్ లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన విషయం తెలియడంతో అక్కడకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు మృతిచెందారని రంగనాథ్ తెలిపారు. బిల్డింగ్ యజమాని ఇంకా అందుబాటులోకి రాలేదని అన్నారు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్‌కి కొంతమంది ఫిర్యాదు చేశారని వెల్లడించారు. గతంలో హైడ్రాకు ఈ బిల్డింగ్ నిర్మాణంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. ఏడు అంతస్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తుల బిల్డింగ్‌ను నిర్మిస్తున్నారని వివరించారు. నాలాను అతిక్రమించి ఈ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోందని రంగనాథ్ అన్నారు. చుట్టుపక్కల ఉన్న భవనాలను పరిశీలించి త్వరలోనే కూల్చివేస్తామని తెలిపారు. బిల్డర్ సాజిద్ 50 గజాల్లో భవనాలు కట్టి హాస్టళ్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. సాజిద్ పరారీలో ఉన్నారని చెప్పారు. 50 గజాల్లో ఈ బిల్డింగ్ నిర్మించారని వెల్లడించారు. హాస్టల్ బిల్డింగులను నిర్మించి.... రెంట్‌కు ఇస్తుంటాడని చెప్పారు. హైడ్రా ఈ ఘటన సహాయక చర్యల్లో పాల్గొంటుందని.... ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. శిథిలాల కింద అదృష్టవశాత్తూ ఇంకెవరూ ఉండకపోవచ్చని భావిస్తున్నామని రంగనాథ్ పేర్కొన్నారు. అలాగే, ఈ ఘటన గురించి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మాట్లాడారు. గతంలోనే ఈ నిర్మాణాలపై తమకు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నాలుగు నెలల క్రితమే ఈ నిర్మాణ పనులను ఆపేసి, సీజ్ చేశామని వెల్లడించారు. మళ్లీ నిన్న వర్క్ మొదలుపెట్టారని చెప్పారు. ఈరోజు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యామని అన్నారు. ఈ లోపు ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెప్పారు. ఈ నాలాను ఆక్రమించి నిర్మాణలు చేస్తున్నారన్నారు. ఈ బిల్డింగ్ చుట్టూ చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అన్నారు. హాస్టల్ బిల్డింగ్ కోసం ఈ నిర్మాణాన్ని చేపట్టారని సృజన తెలిపారు.

THARANGALU DAILY NEWS
ఆదివారం, 23 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ఘనంగా కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి వర్ధంతి వేడుకలు సిపిఐ



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 22 తరంగాలు**
కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రధమ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్ట్ పార్టీ- సిపిఐ వలిగొండ మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి గటించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సల్వాద్రి రవీందర్ అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి సలిగంజి వీరాస్వామి మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుండి రాజకీయాలు అలవర్చుకొని దేశ రాష్ట్ర రాజకీయాలలో కీలక భూమిక పోషించారు. బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతిగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్లమెంట్ సభ్యులుగా ఈ ప్రాంత త్రాగు సాగు, నీరు కై కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సమస్య ను పరిష్కరించే దిశగా అగ్రగామి పాత్ర పోషించారు. యూపీఏ 1 గవర్నమెంట్ లో ఉపాధి హామీ చట్టాన్ని, సమాచార చట్టం, అటవీ హక్కుల చట్టం మరియు గృహహింస లాంటి అనేక చట్టాలు తీసుకురావడం లో ప్రధాన పాత్ర పోషించారని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, రైతు సంగం నాయకులు ఎలగందుల అంజయ్య, తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు శీలం స్వామి, సిపిఐ మండల సమితి నాయకులు బాలాగోని సత్యనారాయణ, పోలెపాక యాదయ్య, నరిగే యాదయ్య, సుద్దాల సాయి కుమార్, బోడిగే సుదర్శన్, మచ్చ లక్ష్మి నారాయణ, తాలుక యాదగిరి, సలిగంజి మచ్చ గిరి, ఎడవల్లి వేణు, యాదమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

## హెజెలో ఫార్మా ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కుంభం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 22 తరంగాలు**
పోచంపల్లి మండలం దొతిగూడెంలోని హెజెలో ఫార్మా కంపెనీలో నిన్న రాత్రి రియాక్టర్ పేలుడు సంభవించి ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను గాంధీ ఆసుపత్రిలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గతంలో కూడా ఈ కంపెనీలో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఘటనను ఎమ్మెల్యే తీవ్రంగా పరిగణించారు. వెంటనే భువనగిరి జిల్లా కలెక్టర్ తో ఫోన్‌లో మాట్లాడి, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే యశోద, సన్‌రైజ్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండటంతో పాటు, కంపెనీ యాజమాన్యం నుంచి తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాక మల్లేష్ యాదవ్, కళ్లెం రాఘవ రెడ్డి, సామా మోహన్ రెడ్డి, అంబరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన బస్సును ప్రారంభించిన దేవస్థానం చైర్మన్ తుమ్మల



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 22 తరంగాలు** వలిగొండ మండల పరిధిలోని మచ్చగిరి గుట్టకు నూతన బస్సును మచ్చగిరి గుట్ట నుండి దిల్సుఖ్నగర్ వరకు గుట్టకు వచ్చే ప్రయాణికులకు హైదరాబాద్ వెళ్లడానికి స్థానిక నాయకులు కాలనీవాసులు హైదరాబాద్ డిపో వారికి అర్జీ పెట్టుకోగా శనివారం దేవస్థానం చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ మరియు డైరెక్టర్లు కొబ్బరికాయ కొట్టి పంతులు పూజ కార్యక్రమాలు నిర్వహించి బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఆలయ అర్చకులు, సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఘనంగా అయ్యప్ప మంత్రదీక్ష - మంత్రోపదేశ మహోత్సవం

- తొలిసారిగా కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా భక్తుల సమ్మేళనం
- కేరళ తంత్ర సంప్రదాయంలో రెండు రోజుల ఆధ్యాత్మిక కార్యక్రమం
- సెప్టెంబర్ 6వ తేదీన ప్రస్తుతం ఇప్పటికే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్ తరగతులు
- సెప్టెంబర్ 7వ తేదీన మంత్రోపదేశం తీసుకునేందుకు నమోదు చేసుకున్న ఔత్సాహికుల కోసం
- మంత్రోపదేశం తీసుకునేందుకు సెప్టెంబర్ 4వ తేదీలోపు నమోదు చేసుకోవాలి



**హైదరాబాద్ ఆగస్టు 22 ( తరంగాలు )**
అయ్యప్ప స్వామి భక్తులకు ఆధ్యాత్మికంగా విశిష్టమైన అవకాశాన్ని కల్పించే ఉద్దేశంతో కేరళ తంత్ర సంప్రదాయ అయ్యప్ప మంత్రదీక్ష, మంత్రోపదేశ మహోత్సవాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు కే. నిరంజన్ రావు తెలిపారు. సంప్రదాయబద్ధమైన తాంత్రిక విధానాలు, పూజలు, హోమాలు, మంత్రోపదేశం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఈ మహోత్సవాన్ని నగరంలో తొలిసారిగా కేరళ సంప్రదాయబద్ధమైన అయ్యప్ప పూజా విధానాలను అభ్యసించిన భక్తుల భారీ సమ్మేళనంతో రెండు రోజుల పాటు (సెప్టెంబర్ 6, 7 తేదీల్లో) నిర్వహించనున్నారు.
ఈ రెండు రోజుల భక్తుల సమ్మేళనంలో కేరళ ప్రభుత్వ గుర్తింపు పొందిన చెంగన్నూర్ మంత్ర విద్యాపీఠంకు చెందిన తాంత్రిక గురుకులంలో ప్రామాణిక ఆలయ పూజా విధానాలు, ఆచారాలను అభ్యసించిన అయ్యప్ప భక్తులు పాల్గొననున్నారు.
ఈ సందర్భంగా పవిత్రమైన అయ్యప్ప మంత్రోపదేశం (ఆధ్యాత్మిక దీక్ష) కూడా నిర్వహించనున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేరళకు చెందిన ప్రముఖ తంత్ర గురువు, మంత్ర విద్యాపీఠం అధిపతి బ్రహ్మశ్రీ టి.డి.పి. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, తాంత్రిక సంప్రదాయబద్ధమైన అయ్యప్ప ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కేరళ ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా అయ్యప్ప స్వామి పూజా విధానాలను భక్తులకు మరింతగా పరిచయం చేయడం, ఆధ్యాత్మిక అవగాహన పెంపొందించడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు. గురువు సన్నిధిలో సంప్రదాయ విధానాలను అనుసరిస్తూ శ్రీ అయ్యప్ప స్వామి ఆరాధన, మంత్రదీక్ష, మంత్రోపదేశం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందించడంతో పాటు అయ్యప్ప ఆరాధనా విధానాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

లి రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు...
మొదటి రోజు సెప్టెంబర్ 6, 2026 ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉదయం ప్రస్తుతం ఇప్పటికే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమం, అనంతరం అయ్యప్ప భజన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు సమయానికి హాజరై కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.
రెండో రోజు సెప్టెంబర్ 7వ తేదీ సోమవారం ప్రధానంగా మంత్రోపదేశం తీసుకునేందుకు నమోదు చేసుకున్న ఔత్సాహికులకు అయ్యప్ప మంత్రోపదేశ మహోత్సవం నిర్వహించనున్నారు. మంత్రోపదేశం తీసుకునేందుకు సెప్టెంబర్ 4వ తేదీ లోపు నమోదు చేసుకునే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం ప్రారంభమయ్యే మంత్రోపదేశం కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగనుంది. మంత్రదీక్ష, మంత్రోపదేశంతో పాటు సంప్రదాయ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

లి ఆధ్యాత్మిక అనుష్ఠానాలకు ప్రత్యేక ప్రాధాన్యం...
ఈ మహోత్సవంలో భాగంగా మహాగణపతి హోమం, పితృ వందనం, పూజా కార్యక్రమాలు, కలశ పూజ, అభిషేకం, మాతృ వందనం, మంత్రోపదేశం, భిక్షాకరణం తదితర ధార్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మహాగణపతి హోమం ద్వారా కార్యక్రమానికి విఘ్నాలు తొలగి శుభప్రదమైన వాతావరణం ఏర్పడాలని ప్రార్థనలు చేయనున్నారు. పితృ వందనం ద్వారా పూర్వీకులను స్మరించుకోవడం, పూజా కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మిక శ్రద్ధను పెంపొందించడం, కలశ పూజ--అభిషేకం ద్వారా సంప్రదాయ ఆచారాలను నిర్వహించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు. అలాగే అయ్యప్ప స్వామి భక్తులు గురువు మార్గదర్శకత్వంలో మంత్రోపదేశాన్ని స్వీకరించి తమ ఆధ్యాత్మిక సాధనను కొనసాగించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

లి హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్వహణ...
ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని గుడ్ల పోచంపల్లి లో ఉన్న ఏవిఆర్ కన్వెన్షన్ హాల్ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌తో పాటు వివిధ రాష్ట్రాలు, తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు, స్వాములు కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.
కార్యక్రమానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పరిమిత సంఖ్యలో వసతి సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సుమారు 30 మంది వరకు వసతి కల్పించే అవకాశం ఉన్నందున ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

లి సంప్రదాయబద్ధమైన మంత్రదీక్షకు అవకాశం...
అయ్యప్ప స్వామి ఆరాధనలో గురువు మార్గదర్శకత్వానికి, మంత్రదీక్షకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. కేరళ తంత్ర సంప్రదాయ పద్ధతులను అనుసరించి నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా భక్తులు సంప్రదాయ ఆధ్యాత్మిక విధానాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మంత్రదీక్ష తీసుకోవాలనుకునే భక్తులు, అయ్యప్ప స్వామి ఆరాధనలో మరింత లోతైన ఆధ్యాత్మిక సాధన చేయాలనుకునే వారు, స్వాములు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

లి భక్తులకు నిర్వాహకుల పిలుపు...
అయ్యప్ప స్వామి భక్తులు, స్వాములు, ఆధ్యాత్మిక సాధకులు కార్యక్రమంలో పాల్గొని గురువుల ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, నమోదు, వసతి ఇతర వివరాల కోసం ముందుగా నిర్వాహకులను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు నిర్వాహకులు కె. నిరంజన్ రావు గురూజీ ఫోన్ నెంబర్ 8712164646 ను సంప్రదించగలరు.

## అన్నదాన కార్యక్రమాలు భేష్



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 22,(తరంగాలు):** వేల్పుగొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దైవ దర్శనం కోసం వచ్చె భక్తులకుఆర్యవైశ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడంపై మహారాష్ట్ర లోని సోలాపూర్ ,హైదరాబాద్,కరీంనగర్ నుండి విచ్చేసిన భక్తులు హర్షం వ్యక్తం చేసారు.ప్రతి ఏటా శ్రావణమాసంలో వచ్చే శనివారాలలో భక్తులు సుదూర ప్రాంతాలనుండి పెద్ద సంఖ్యలో జఫర్ గడ్ లోని పశ్చిమ గుట్టపై నెరసిన స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా అన్నదాన కమిటీ అధ్యక్షులు చిట్టిమళ్ళ కృష్ణమూర్తి మాట్లాడుచూ సుదూర ప్రాంతాలనుండి విచ్చేస్తున్న భక్తులు అన్నదాన వితరణపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. నేడు వెయ్యి మంది భక్తులకు భోజన సౌకర్యాలను కల్పించినట్లు ఆయన తెలిపారు. కాగా సోలాపూర్ ,హైదరాబాద్ ,నిజామాబాద్ ,కరీంనగర్ ,వరంగల్ తదితర ప్రాంతాలనుండి భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పాలకుర్తి రాజన్న, బోనగిరి నాగరాజు,బెలిదె హరిశంకర్ , గందె మురళీ, ,కొనిశెట్టి వెంకన్న,అంచూరి శ్రీనివాస్ ,బోనగిరి శ్రవణ్ కుమార్ ,అంచూరి యుగందర్ , బెబిదె సీతారామయ్య, పట్టూరి శ్రీధర్,, అంచూరి శ్రీరాములు, గందె సోమన్న,అంచూరి కమల, గందె అనిత, ఇమ్మడి మాధవి,దాంశెట్టి శ్రావ్య,సమత తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి, ఆగస్టు 22, తరంగాలు:**
తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి లడ్డు ప్రసాదాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ కి అందజేశారు. అనంతరం ఆలేరు నియోజకవర్గంతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా వైద్య,ఆరోగ్య రంగానికి సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మంత్రి దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించి,ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

## పకడ్బందీగా రీ సర్వే జరగాలి : కలెక్టర్

**పాలేరు ఆర్సీ, ఆగస్టు 22(తరంగాలు ) :** కూసుమంచి మండలంలోని భగత్ వీడు రెవిన్యూ గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే విషయమై జిల్లా కలెక్టర్ దివాకర టీ ఎస్ శనివారం క్షేత్రస్థాయిలో ప్రదేశంపై సందర్శించి సర్వే బృందాలకు, రైతులకు తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే బృందాలు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, రైతు స్వాధీనంలో ఉన్న భూమిని సరిహద్దు రైతుల సమక్షంలో వారి వాంగ్మూలాలను రికార్డు చేయవలసినదిగా సూచించారు. కచ్చితత్వమైన సర్వేను నిర్వహించాలని, ఇట్టి భూ సర్వే కు సంబంధిత రైతులు కూడా సహకరించాలని సూచనలు చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో సందర్శించి రీ సర్వేకి సంబంధించి డాటా ఎంట్రీ ను పరిశీలించి డేటా ఎంట్రీ చేస్తున్న అధికారులకు తగు



సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రాజేందర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎర్రాప్రగడ, తహసిల్దార్ డి సైదులు, . సర్వేయర్ లు, ఆర్ ఐ లు,రెవెన్యూ బృందాలు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
ఆదివారం, 23 ఆగస్టు , 2026


# పేదవారి సొంత ఇంటి కల ఇందిరమ్మ ఇళ్లతో సాకారం

•వడ్లకొండలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజచేసిన
•గ్రామ సర్పంచ్ డెక్క సునీత కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అత్తి కుమార్ స్వామి



**పర్వతగిరి, ఆగస్టు 22, తరంగాలు :** పేదవారి సొంత ఇంటి కల ఇందిరమ్మ ఇళ్లతో సాకారం అవుతుందని వడ్లకొండ గ్రామ సర్పంచ్ డెక్క సునీత కుమార్ అన్నారు. పేదవారి సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం, వడ్లకొండ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మొదటి విడత లో ఇందిరమ్మ ఇల్లు మంజూరై, కట్టడానికి ఆర్థిక స్తోమత లేక పోవడంతో ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాలతో కాంట్రాక్టర్ నిర్మించడానికి ముందుకు రావడంతోగ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వల్లం దాసు బేబీ--బుద్ధిరాజు దంపతుల ఇంటి నిర్మాణానికి గ్రామ సర్పంచ్ డెక్క సునీత కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అత్తి కుమార్ స్వామి ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ల ఫోరం మండల ఇంచార్జ్ వల్లం దాసు రాజు (అక్రమ్), వార్డు సభ్యులు నరుకుడు సాంబరాజు, రావుల యాకలక్ష్మి, బైరి మౌనిక - రాజేష్, యాకూబ్ పాషా, కార్యదర్శి వాణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు డెక్క అనిల్ కుమార్, జుట్టుకొండ రమేష్, మోడం రమేష్, పంతంగి వెంకన్న, సొసైటీ డైరెక్టర్ వల్లందాస్ రంగయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వల్లం దాసు చిన్న రంగయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు జుట్టుకొండ రాజు, పంతంగి వెంకన్న, చింతకాయల జంపయ్య, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్ల నిర్లక్ష్యం

• సెయింట్ పాల్ స్కూల్ 50 మంది పిల్లల ను కాపాడి న లారీ డ్రైవర్.
• స్కూల్ బస్ అతి వేగం బ్రేక్ పడక పోవడం డ్రైవర్ నిర్లక్ష్యం.
• భయానక వాతావరణాన్ని సృష్టించిన ప్రమాదం.
• ఊపిరి పీల్చుకున్న తల్లి తండ్రులు.
• అధికారులు చర్యలు తీసుకుంటారా

చేతులు దులుపుతారా




**తొర్రూరు తరంగాలు న్యూస్..**
తొర్రూర్ మున్సిపల్ పరిధిలో వరుసగా రెండవ రోజు స్కూల్ పిల్లలు ప్రమాదం నుండి బయటపడ్డారు. ఉదయం 8:30 గంటల ప్రాంతంలో మడూర్ నుండి సెంట్ పాల్ స్కూలుకు50 మంది పిల్లలను తీసుకొస్తున్న క్రమంలో స్కూల్ దగ్గర డ్రైవర్ లారీని ఓవర్టేక్ చేసి స్కూల్ లోకి తీసుకెళ్లే లోపల భారీ ప్రమాదం జరిగినది. వరంగల్ నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ నీ ఓవర్టేక్ చేసే టైంలో బస్ డ్రైవర్ పిల్లలు ఉన్నారనే విషయం మర్చిపోయి అతివేగంతో నడపడంతో బ్రేక్ పడకపోవడంతో లారీని దాటే సమయంలో లారీ డ్రైవర్ పూర్తి ఎడమ చేయి వైపు దిగిన భారీ ప్రమాదం జరగక తప్పలేదు. ప్రమాదం పొంచి ఉందనే సమయాన్ని పసిగట్టిన లారీ డ్రైవర్ పూర్తిగా రోడ్డును దింపడంతో భారీ ప్రమాదము జరగకుండా పిల్లల ను రక్షించిన వాడిగా లారీ డ్రైవర్ చాకచక్యానికి పిల్లల తల్లిదండ్రులు రుణపడి ఉంటారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం బస్సు డ్రైవర్లు నిర్లక్ష్య వైఖరితో అధికారులు పిల్లల రక్షణకు పాఠశాల యాజమాన్యం నుండి ఎలాంటి హామీ ఇస్తారు ఈ దుర్ఘటన పై ఆర్ టి ఏ అధికారులు గానీ విద్యాశాఖ అధికారులు కానీ పాఠశాలలపై ఏం చర్యలు తీసుకుంటారనేధి ఉత్కంఠతో చూడవలసిన సమయం. ప్రైవేట్ పాఠశాలలను కాపాడేందుకు అధికారులు సమయతమవుతారో, పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుండి తల్లిదండ్రులకు ఏ విధమైన రక్షణ ఇప్పిస్తారో మునుముందు అధికారులు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఇంత గోర సంఘటన జరిగిన మండల విద్యాశాఖ అధికారి ఎలాంటి నిర్ణయం తీసుకుంటాము అనేది విలేకరులకు తెలపకపోవడం పిల్లల తల్లిదండ్రులకు ఏం భరోసా ఇస్తారా అనేది అధికారుల ఒంటెద్దు పోకడకు నిదర్శనం. ఏదైనా సంఘటన జరిగితే కానీ చర్యలు తీసుకునే పరిస్థితిలో అధికారులు లేరనేది స్పష్టమైన సంకేతం గా విధితమైతుంది. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడి పాఠశాలలపై చర్యలు తీసుకొని పిల్లల తల్లిదండ్రులకు మేమున్నామని భరోసా కోసం ఎదురుచూస్తున్నరు..

# రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన జాటోతు శ్రీనివాస్ నాయక్

•పార్టీ, ప్రభుత్వ పరంగా అండగా ఉంటాం..
•మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి యాజమాన్యానికి సూచన



పర్వతగిరి, ఆగస్టు 22 (తరంగాలు): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి గార్డెన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ రాపాక రేణుక--నాగయ్యను కాంటెస్టెడ్ జెడ్పీటీసీ జాటోతు శ్రీనివాస్ నాయక్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ రేణుక--నాగయ్య కుటుంబానికి పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గార్డెన్ హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోతు భాస్కర్ నాయక్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఔదార్యాన్ని చాటిన ఆదివాసీ నాయకులు పెండకట్ల యాకయ్య

**ఇల్లందు ప్రతినిధి, ఆగస్టు 22, ( తరంగాలు)** ఇల్లందు మండలం లచ్చగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో ఇటీవల జరిగిన విద్యుత్ ఘాతంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైందన్న విషయాన్ని తెలుసుకున్న, ఆదివాసీ నాయకులు పెండకట్ల యాకయ్య సోమవారం ఆ గ్రామానికి చేరుకొని ఆ కుటుంబానికి 150 కేజీల బియ్యం, మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సలీం, శోభన్, నరేష్, రవి తదితరులు ఉన్నారు.



# ఉత్సాహంగా భాషిత జూనియర్ కళాశాల స్వాగత సంబరాలు






**కుత్బుల్లాపూర్ ఆగస్టు 22 ( తరంగాలు )**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఐడిపిఎల్ కి చెందిన భాషిత జూనియర్ కళాశాల నూతన విద్యార్థులకు సంబంధించిన స్వాగతోత్సవ కార్యక్రమం షాపూర్ నగర్‌లోని శుభమ్ సెలబ్రేషన్స్ లో శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జూనియర్ విద్యార్థినీ విద్యార్థులు,సీనియర్ విద్యార్థినీ విద్యార్థులు, టీచింగ్ సిబ్బంది, నాన్ టీచింగ్ సిబ్బందిమరియు యాజమాన్యం ఉత్సాహంగా పాల్గొన్నారు.జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించిన యాజమాన్యం.కళాశాల యాజమాన్యం నుండి చైర్మన్ డాక్టర్ దాయక సత్యనారాయణ,కరస్పాండెంట్ తాటిచెర్ల శైలజ, డైరెక్టర్ తాటిచెర్ల హేమలత, క్యాంపస్ అధినేత తాటిచెర్ల కృష్ణ పాల్గొన్నారు. చైర్మన్ సత్యనారాయణమాట్లాడుతూ ఐఐటి, నీట్ వంటి జాతీయ స్థాయి ర్యాంకులు సాధించాలంటే విద్యార్థులందరూ పూర్తి క్రమశిక్షణతో పాటు కఠోర శ్రమ, ఏకాగ్రత,సమయపాలన అవసరం అని చెప్పారు. కరస్పాండెంట్ శైలజ, డైరెక్టర్హేమలత మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులలో లక్ష్యం పట్ల అవగాహన, ఉత్సాహం నింపారు.ఈ కార్యక్రమంలో జబర్దస్త్ నుండి అదుర్స్ ఆనంద్, అవతార్ చిట్టిబాబు, జబర్దస్త్ ఫణి పాల్గొని, వివిధ స్కిట్ లు, కామెడీ పంచ్ లు, డాన్స్ లతో ఆహుతులను అలరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఆట పాటలతో, డాన్స్ లతో,కామెడీ స్కిట్ లతో, ర్యాంప్ వాక్ లతో రోజంతా కేరింతలు కొట్టారు. చివరిగా విద్యార్థులందరూ భాషిత జూనియర్ కళాశాల ద్వారా రాష్ట్రమరియు జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు.టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులుకార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.కార్యక్రమం చివరలో గత సంవత్సరం రాష్ట్ర స్థాయి అకడమిక్ టాపర్స్ కి యాజమాన్యం మెరిట్ సర్టిఫికేట్స్ అందజేసారు.రానున్న సంవత్సరం రాష్ట్ర టాపర్ ర్యాంకర్స్ కి ఒక్కొక్కరికి లక్షరూపాయలు నగదు బహుమతిని ప్రకటించారు.

# ఉమాశంకర్ కుటుంబానికి వన్నాల వెంకటరమణ పరామర్శ





హైదరాబాద్, ఆగస్టు 22 (తరంగాలు ప్రతినిధి): కుమార్తె మృతితో విషాదంలో ఉన్న ఉమాశంకర్ కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ పరామర్శించారు.బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి డాక్టర్ ఉమా శంకర్ ఏకైక కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

శనివారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో నల్లకుంట--డీడీ కాలనీలోని డాక్టర్ ఉమా శంకర్ స్వగృహానికి వెళ్లిన డాక్టర్ వన్నాల వెంకటరమణ, మృతురాలి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఉమా శంకర్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, జరిగిన విషాద ఘటనపై తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



THARANGALU DAILY NEWS
ఆదివారం, 23 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## బీపీఎల్ కోటాలో పరిశీలిస్తాం

- టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్ర వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ దివాకర



**పాలేరు ఆర్సీ, ఆగస్టు 22 : ( తరంగాలు)**
దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) కోటా లేదా మరోరకంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర సూచించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) శనివారం చేపట్టిన పాదయాత్రలో భాగంగా కూసుమంచి తహశీల్దారు కార్యాలయంలో తనను కలిసిన పాదయాత్ర బృందానికి కలెక్టర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనకు జిల్లా వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఇళ్ల స్థలాలు సాధించేవరకు పోరాటం కొనసాగిస్తామని వివరించారు. ఏదో ఒక రకంగా ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సొసైటీల ద్వారా ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఏ రకంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వవచ్చో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే బీపీఎల్ కోటాలో ఇచ్చినా అభ్యంతరం లేదంటున్నారు కాబట్టి... ఆ అంశాన్ని కూడా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట కూసుమంచి తహశీల్దారు సైదులు కూడా ఉన్నారు. అంతకుముందు పాదయాత్ర బృందానికి ప్రైవేట్ ఉపాధ్యాయుల బృందం ఘనంగా స్వాగతం పలికింది. జర్నలిస్టుల పిల్లలు పూలమాలలు వేసి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఇర్షాద్, అజీజ్, శేఖర్ రెడ్డి, ప్రసాద్, కిరణ్, పెంద్ర అంజయ్య, కొమ్ము ప్రభాకర్, పందిరి వెంకట్ రెడ్డి, గర్నె నాగేశ్వరరావు, కర్ణబాబు, మేడవరపు రామబ్రహ్మం, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.




# చట్టం అందరికీ సమానమే

- ‘తప్పు చేస్తే చర్యలు తప్పవు”
- బీఆర్ఎస్ నేతల ఆరోపణలు అవాస్తవం
- అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారు
- జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత
- చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను బీఆర్ఎస్ శ్రేణులు మానుకోవాలి
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 22,తరంగాలు** : చట్టం అందరికీ సమానమేనని ..
తప్పు చేస్తే చర్యలు తప్పవని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ అన్నారు.వర్ధన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంపై కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టం అందరికీ సమానమేనని వెంకన్న గౌడ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ జెండా ఆవిష్కరణ పేరుతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించడంతో పాటు జాతీయ జెండా నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు తమ విధుల్లో భాగంగానే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నారని, ఇందులో ఎలాంటి రాజకీయ కక్షసాధింపు లేదన్నారు.

### అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న తీరుపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వెంకన్న గౌడ్ అన్నారు. గతంలో నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ నేతలు, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ప్రజాపాలన, అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

### పోలీసులపై రాజకీయాలు తగవు

శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, తప్పు చేసిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను బీఆర్ఎస్ శ్రేణులు మానుకోవాలని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, అయినవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, చిట్టూరి రాజు, సిద్ధం లక్ష్మీనారాయణ, మరుపట్ల అరుణ, సాయికుమార్, తీగల సునిత తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీలను అనగతొక్కుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్




**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 22 తరంగాలు** వలిగొండ మండల కేంద్రంలో జిల్లాబీసీల పట్ల వివక్షత చూపుతూ బీసీ కులగనున ఆశాస్త్రీయంగా, అస్పష్టతగా కుల గణన చేసి చేతులు దులుపుకున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 90 శాతం జనాభా ఉన్న బీసీ జాతికి దక్కాల్సిన వాటా దక్కకుండా ప్రధానమంత్రి మోదీ బీసీలను అనగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలు, సెప్టెంబర్ 20న దేశవ్యాప్తంగా ఉన్న బీసీ ప్రతినిధులను రాష్ట్రానికి ఆహ్వానించి ప్లీనరీ నిర్వహించి నవంబర్ లో లక్ష మందితో పార్లమెంటు ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు నాన చర్ల రమేష్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వరికుప్పల మధు,బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్, యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు నరేష్ ప్రజాపతి,గూడూరు భాస్కర్ అనంతుల సాయి, పబ్బు స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ వైద్యుల ఉసురు పోసుకోవద్దు

- -ఆయుష్ వైద్యులపై కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వివక్ష నశించాలి
- న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాడుతుంది
- ఆయుష్ వైద్య విద్యార్థుల డిమాండ్లు న్యాయమైనవి.. తక్షణమే స్టైపెండ్ పెంచాలి.
- కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు .. మీ గ్రూపు రాజకీయాలు, కుర్చీలాటలు చాలు!
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 22,తరంగాలు** : ప్రభుత్వంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు తమ వ్యక్తిగత ఈగోలు, రాజకీయ గొడవలు, పదవుల పంపకాలపై ఉన్న శ్రద్ధ.. రోడ్డున పడి కొట్లాడుతున్న విద్యార్థులపై చూపకపోవడం సిగ్గుచేటు అని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల హౌస్ సర్జన్లు (ఇంటర్న్‌లు), పీజీ వైద్య విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై తెలంగాణ ఆయుష్ (ఆయుష్ ) జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక ధర్నాకు భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా పూర్తి మద్దతు ప్రకటిస్తోందని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తెలిపారు. శనివారం కళాశాల ప్రాంగణంలో 19వ రోజు జరుగుతున్న నిరసన శిబిరాన్ని ఆయన సందర్శించి, విద్యార్థులకు సంఘీభావం తెలియజేశారు.ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. అల్లోపతి (ఎంబీబీఎస్ ) వైద్యులతో సమానంగా విధులను నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్య విద్యార్థుల పట్ల ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపడం దురదృష్టకరమన్నారు. ఒకే రకమైన సేవలు అందిస్తున్నప్పటికీ, అల్లోపతి హౌస్ సర్జన్లకు నెలకు రూ.29,972 స్టైపెండ్ ఇస్తూ, ఆయుష్ హౌస్ సర్జన్లకు కేవలం రూ.13,754 మాత్రమే ఇవ్వడం తీవ్రమైన అన్యాయమని ఆయన మండిపడ్డారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయుష్ విద్యార్థుల స్టైఫండ్‌ను పెంచాలని అసెంబ్లీలో గళమెత్తారని, కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టారని బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ విమర్శించారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో 77 ప్రకారం ఆయుష్ విద్యార్థులకు నెలకు రూ.30,000 స్టైపెండ్ ఇవ్వాల్సి ఉన్నా, దానిని అమలు చేయకపోవడం ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనం.2016 లో ఖరారు చేసిన స్టైపెండ్‌ను నేటికీ మార్చకపోవడం దారుణం. పెరిగిన జీవన వ్యయాలకు అనుగుణంగా తక్షణమే స్టైపెండ్‌ను పెంచాలి.
విద్యార్థులకు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు.వైద్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆయుష్ విద్యార్థులను రోడ్లపైకి తెచ్చిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన విమర్శించారు. విద్యార్థుల పొట్టకొట్టే ధోరణిని వీడి, ప్రభుత్వం తక్షణమే స్పందించి అల్లోపతి వైద్యులతో సమానమైన వేతనాన్ని, జీవో 77 ప్రకారం స్టైపెండ్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయుష్ జేఏసీ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ మద్దతు కొనసాగుతుందని గంట రవికుమార్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, బైరి నాగరాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బైరి మురళీకృష్ణ, బైరి శ్యాంసుందర్, ఎరుకల రఘునారెడ్డి, మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మదాసు రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, జిల్లా నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, జన్ను ప్రభాకర్, ఇనుముల అరుణ్ కుమార్, మండల నాయకులు వైట్ల గణేష్, తమ్మిశెట్టి క్రాంతి కుమార్, సుంచు కేశవ్, పోశాల సతీష్, సుర శ్రీనివాస్, బీజేవైఎం నాయకులు ఆడేపు రవిరామ్, వినయ్, మున్నా మరియు బీజేపీ నేతలు పాల్గొన్నారు.


## అబద్ధాలు చెప్పడం,మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీ దిట్ట

**బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ళ కుమారస్వామి**



వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 22,తరంగాలు : స్వాతంత్ర దినోత్సవ వేడుకలు చేస్తే ట్రాఫిక్ అంతరాయం కలిగిందని,మైక్ లకు పర్మిషన్ లేదని తప్పుడు ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ నాయకుల పై కేసు పెట్టింది మీ పార్టీ నాయకులు కాదా? పక్కనే భవన నిర్మాణ కార్మికులు మరియు ఆటో యూనియన్ నాయకులు కూడా జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది వారిపై లేని కేసులు కేవలం బిఆర్ఎస్ నాయకుల పైన పెట్టడంలో అంతరార్థం ఏంది? అని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పేవి నీతులు.. చేసేవి చిల్లర రాజకీయాలు.. అని ఎద్దేవా చేశారు. జాతీయ జెండా పండుగ చేస్తే ట్రాఫిక్ అంతరాయం అన్నారు,అదే సెంటర్ లో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు చేసి స్లొగన్స్ ఇచ్చుకుంటూ స్పీచ్ లు ఇస్తుంటే ప్రజలకు అంతరాయలు కలగవా? దానికి అనుమతులు అవసరము లేదా?
వాటికి కేసులు ఉండవా? అని ఈ సందర్భంగా ప్రశ్నించారు.చట్టం ముందు అందరు సమానులే అయితే మీ మీద కూడా కేసులు అవ్వాలి కదా?
మీకున్న అధికారంతో ఆఫీసర్లను ఒత్తిడి చేసి మాపై కేసులు పెట్టింది ఇది నిజం కాదా? అని అన్నారు. ఇప్పటికైనా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు దిక్కుమాలిన రాజకీయాలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. పాలన చేతకాకపోతే రాజకీయాలు మానేయాలని.. కక్షపూరిత రాజకీయాలు చేస్తే ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం





- ఉషోదయ కాలనీ అభివృద్ధికి రూ.42.50 లక్షలు
- ఉషోదయ కాలనీ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలి
- అంతర్గత సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 22,తరంగాలు :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు.గాజులరామారం డివిజన్ పరిధిలోని ఉషోదయ కాలనీలో రూ.42 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఉషోదయ కాలనీకి మంజీరా నీటి సరఫరాను మంజూరు చేయించి, కాలనీవాసుల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసి కృషి చేయాలని సూచించారు.కాలనీవాసులు తమ ప్రాంతంలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఉషోదయ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించగా, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్తో పాటు కాలనీ వాసులు నరసింహారెడ్డి, సురేందర్ రెడ్డి, గురు ప్రసాద్, వెంకట్ రెడ్డి, కృష్ణారెడ్డి, విజయ్ కుమార్, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, మహేశ్వర్ రెడ్డి, రమేష్, వీరన్న గౌడ, కోటేశ్వరరావు, యాదగిరి, ధూళిపాల శ్రీనివాసరావు, సోమశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## ఖమ్మం నగరపాలక సంస్థలో ఉద్యోగుల జె ఏ సి ఏర్పాటు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : శనివారం జి ఎం ఆర్. ఫంక్షన్ హాల్ లో ఖమ్మం నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు కార్మికుల అందరితో కలిపి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింగి. ఈ సమావేశం లో జె ఏ సి ఏర్పాటు చేయడం జరిగింది. ఆ.సుధాకర్ , అధ్యక్షత వహించిన ఈ సమావేశం లో ముఖ్య అతిథి గా పాల్గొన్న ఏలూరు శ్రీనివాసా రావు, టి జి ఓ రాష్ట్ర అధ్యక్షులు టి జి ఏ సి సెక్రటరీ జనరల్,మాట్లాడుతూ మన హక్కులకోసం ఖమ్మం కార్పొరేషన్ లోని అన్ని విభాగాల అధికారులు ,ఉద్యోగుల కార్మికులు అందరూ ఏకమై తమకు రావాల్సిన న్యాయపరమైన హక్కులకోసం కలిసి పోరాడాలని , జిల్లా , రాష్ట్ర స్థాయిలో లోని ఉద్యగ సంఘాలు అన్ని కూడా మీకు తోడుగా మీరు సాగించే ప్రతి పోరాటం లో ముందు వరసలో ఉంటాయని హామీ ఇచ్చారు. గుంటుపల్లి శ్రీనివాస రావు టి ఎన్ జీ ఓస్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఖమ్మం కార్పొరేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఈ మధ్య కాలంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉద్యోగుల హక్కుల పోరాటాలలో మీకు తోడుగా జిల్లా జె ఏ సి మొత్తం ఉంటుంది అని హామీ ఇచ్చారు. ఇంకా ఈ సమావేశం లో కొణిదెన శ్రీనివాస్ , టి ఎన్ జీ ఓస్ జిల్లా కార్యదర్శి, మోదుగు వేలాద్రి టి జి ఓ జిల్లా కార్యదర్శి, జెడిఎస్. జైపాల్ విజయ్ కుమార్ టీఎన్జీవోస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, బెజ్జంకి ప్రభాకర చారి, టీఎన్జీవోస్ నగర అధ్యక్షులు పాల్గొని కార్పొరేషన్ ఉద్యగ,కార్మికులను ఉద్దేశించి మాట్లాడినారు. ఈ సమావేశం లో ఖమ్మం నగరపాలక సంస్థలో అన్ని విభాగాల లలో పనిచేస్తున్న 500 మంది అధికారులు, ఉద్యోగులు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం కేఎంసి జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జెఎసి చైర్మన్ గా జి.శ్రీనివాస రావు, జెఎసి గౌరవ అధ్యక్షులు గా ఎ. సుధాకర్ , జెఎసి కన్వీనర్ గా బుర్రి వెంకటేశ్వర్లు ను ఎన్నుకోవడం జరిగింది. మొత్తం 42 తో నూతన జేఏసీ కమిటీ ను ఎన్నుకోవడం జరిగినది.

# ఆర్టీసీ కార్మికులపై పెంచిన పనిభారం తగ్గించాలి



- కార్మిక సంఘాలతో చర్చించి ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఆగస్టు 25న అన్ని డిపోలు, రీజియన్ కేంద్రాల్లో ఒక్కరోజు నిరాహార దీక్షలు: ఎస్డబ్ల్యూఎఫ్

**ఖమ్మం జిల్లా బ్యూరో,ఆగస్టు 22,తరంగాలు:** ఆర్టీసీ కార్మికులపై పెంచిన పనిభారాన్ని తగ్గించాలని, కార్మిక సంఘాలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం--ఆర్టీసీ యాజమాన్యంతో జరిగిన చర్చల్లో అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 25న అన్ని డిపోలు, రీజియన్ కేంద్రాల్లో ఒక్కరోజు నిరాహార దీక్షలు చేపట్టాలని టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్డబ్ల్యూఎఫ్--సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.ఆగస్టు 19న ఖమ్మంలో ఎస్డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్మిక సంఘాలతో చర్చల అనంతరం అంగీకరించిన అంశాల అమలులో జరుగుతున్న జాప్యంపై సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. పని భారాల తగ్గింపుపై డిపో, రీజియన్ స్థాయిలో కార్మిక సంఘాలు, యాజమాన్యం చర్చించాలని గతంలో అంగీకరించినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అధికారులు ఏకపక్షంగా డ్యూటీలను మార్చి అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఎస్డబ్ల్యూఎఫ్ ఆరోపించింది.అన్ని డ్యూటీలను శాస్త్రీయ పద్ధతిలో రూట్ సర్వే చేసి రన్నింగ్ టైమ్ను నిర్ణయించి, పెంచిన పనిభారాన్ని తగ్గించాలని సంఘం డిమాండ్ చేసింది. తక్షణమే డిపో, రీజియన్ స్థాయిలో కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరింది.

### ఉద్యోగ భద్రతపై స్పష్టమైన విధానం కావాలి

ఉద్యోగ భద్రతకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీతో జరిగిన చర్చల్లో పలు ప్రతిపాదనలు చేసినట్లు ఎస్డబ్ల్యూఎఫ్ తెలిపింది. మోటార్ వెహికిల్స్ యాక్ట్కు సంబంధించిన నిబంధనలను అమలు చేయడంతో పాటు, ఆర్టీసీ కండక్టర్ రెగ్యులేషన్లో అవసరమైన మార్పులు చేయాలని కోరినట్లు పేర్కొంది. ఉద్యోగ భద్రతపై మార్గదర్శకాలు రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపింది.

### అలవెన్సులు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలి

2017 నుంచి అమల్లో ఉన్న అలవెన్సులను 80 శాతం పెంచి అమలు చేస్తామని ఏప్రిల్ 21న జరిగిన చర్చల్లో అంగీకరించినప్పటికీ ఇప్పటికీ అమలు కాలేదని ఎస్డబ్ల్యూఎఫ్ ఆరోపించింది. దీనివల్ల కార్మికులు నెలకు సుమారు రూ.31 కోట్ల మేర ఆర్థికంగా నష్టపోతున్నారని



పేర్కొంది. పెంచిన అలవెన్సులను వెంటనే అమలు చేసి నష్టాన్ని నివారించాలని డిమాండ్ చేసింది.బ్రెడ్ విన్నర్ స్కీంలో నియమితులైన వారిని రెగ్యులర్ చేయడం, భవిష్యత్తులో నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టడం, వారి సర్వీసుకు రక్షణ కల్పించడం, చర్చల ప్రొసీడింగ్స్ కాపీని యూనియన్లకు అందించడం వంటి డిమాండ్లను కూడా పరిష్కరించాలని కోరింది.అదేవిధంగా 2019లో నమోదైన పోలీసు కేసులను ఎత్తివేయాలని, జూనియర్ అసిస్టెంట్ టెస్ట్లో ఉత్తీర్ణులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని, రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన 2017 బకాయిలను చెల్లించాలని, ఆర్పీఎస్--2021ను అమలు చేసి అరియర్స్ చెల్లించాలని, పీఎఫ్ హయ్యర్ పెన్షన్ సమస్యను పరిష్కరించాలని ఎస్డబ్ల్యూఎఫ్ డిమాండ్ చేసింది.ఈ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 25న నిర్వహించనున్న నిరాహార దీక్షల్లో కార్మికులు యూనియన్ అనుబంధాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎస్డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

## కాంగ్రెస్ ఇచ్చిన దొంగ హామీలు నమ్మి ఓట్లేశారు

- గ్యారంటీ కార్డులు పంచి ముంచిన తుమ్మల
- మాజీ మంత్రి పువ్వాడ



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన 420 దొంగ హామీలు 6 గ్యారంటీలు నెరవేర్చలేక పోయిందని ఏద్దేవా చేసారు. కాంగ్రెస్ ఇచ్చిన దొంగ హామీలు నమ్మి మీరు ఓట్లు వేశారు. అత్తకు 4000 కోడలు 2500 ఇస్తాం అన్నారు ఏమైంది.ప్రతి మహిళకి 2500 తాతకి అవ్వకి 4000 పెంక్షన్ అని చేతులు ఊపి ఇప్పుడు చేతులు ఎత్తారు. కేసీఆర్ తెచ్చిన ప్రాజెక్టులు మేమే పూర్తి చేసి నీళ్లు పారిస్తున్నాం అన్నారు. ఇప్పుడు నీళు లేక రైతాంగం గోస పడుతుంది.

రుణ మాఫీ ఇస్తానని వ్యవసాయ మంత్రి తుమ్మల టోపీ పెట్టారు.కేసీఆర్ 10వేలు ఇచ్చిన రైతు బందును మార్చి రైతు భరోసా చేసి ఏ భరోసా లేకుండా చేసారు.ఏమన్నా అడిగితే కుయ్ కుయ్ అని తిరుగుతున్నారు. అలాగే పధకాలు కూడా కుయ్ కుయ్ అంటూ ఆటే పోతున్నాయి.కాంగ్రెస్ అంటే జూటా మాటలు ప్రభుత్వం.ప్రజల తరపున పోరాడడం కోసమే వచ్చా ఎన్నికలు ఉన్నా లేకపోయినా ప్రజలు వద్దకే వచ్చి కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎండగడుతున్నాం.నా మీద అబద్ధపు ప్రచారం చేసి ప్రజలను మోసం చేసారు.బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఆశీస్సులతో రఘునాథపాలెం మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశా.రాజీవ్ కాలువ పనులు ఎంత నాణ్యమైనదో కొట్టుకుపోయిన కాలువ చూస్తే తెలుస్తుంది.కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చవరకు మీకు నేను అండగా ఉండి ప్రశ్నిద్దాం అూని భరోసానిచ్చారు.కార్యక్రమంలో నాయకులు వీరునాయక్,లక్షణ్ నాయక్, మండడుపు నరసింహారావు, మాధవరావు,సర్పంచ్ శంకర్,గుత్తా రవి,హరిప్రసాద్,పిన్ని కోటేశ్వరరావు,మెంటం రామారావు,ప్రదీప్,సైదులు,రవి, నరేష్,క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీ తక్షణమే నెరవేర్చాలి

- టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు..
- కూసుమంచిలో కొనసాగిన పాదయాత్ర

**పాలేరు ఆర్సీ, ఆగస్టు 22 (తరంగాలు) :** కాంగ్రెస్ నాయకులు ఎన్నికల హామీలో ప్రభుత్వం ఏర్పాడితే జర్నలిస్టులకు ఇండ్ల స్థలం ఇచ్చి, ఇండ్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీ వెంటనే నెరవేర్చాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుబ్లేడు గ్రామంలో ప్రారంభమైన పాదయాత్ర మధ్యాహ్నానికి కూసుమంచి చేరుకుంది. ఈ పాదయాత్రలో జిల్లా అధ్యక్షుడు ఖదీర్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని తమ డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు. కూసుమంచి మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అదే సమయానికి అధికారులతో సమావేశం అయిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ



సందర్భంగా వారు కలెక్టర్ ను ఎన్నోఏండ్ల జర్నలిస్టుల కల ప్రజాప్రభుత్వంలో నెరవేర్చాలని కోరారు. అందుకు స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ..అవసరం అయితే ప్రభుత్వంతో మాట్లాడి బీపీఎల్ కోటాలోనైనా జర్నలిస్టుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ మెంబర్ పెంద్ర అంజయ్య, సీనియర్ జర్నలిస్ట్ లు పందిరి వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు కర్ణబాబు, మేడవరపు రామబ్రహ్మాం, సంతోష్, ఇరుగు శ్రీను, తిప్పర్తి సైదులు, వెంకయ్య, జనార్ధన్, ఇతర జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లు గడ్డ కళలకు, అద్భుతమైన సంస్కృతికి నిలయం





- ఓరుగల్లు జానపద కళలకు పునర్వైభవం
- జానపదాలు,కాకతీయ కళలు మన జాతి సంపద.. భావితరాలకు అందించాలి
- పి లేని 103 రకాల కళల పరిరక్షణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనివ్వాలి
- ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

**హన్మకొండ ప్రతినిధి , ఆగస్టు 22 (తరంగాలు):** ఓరుగల్లు గడ్డ ఘనమైన కళలకు, అద్భుతమైన సంస్కృతికి నిలయమని, తెలంగాణ జానపద కళలు, కాకతీయుల కళా వైభవం కేవలం వినోదం మాత్రమే కాదని, అవి మన జాతి సంపద అని ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ (వరంగల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఓరుగల్లు జానపదాల స్వరాల ఝల్లు.. కాకతీయ సకల కళల జాతర" ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ, అంతరించిపోతున్న జానపద కళలను, కాకతీయుల వైభవాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ జానపద వైభవాన్ని చాటిచెప్పేలా కళాకారులు ప్రదర్శిస్తున్న నైపుణ్యం అభినందనీయమని, ఇలాంటి ఉత్సవాలు ఓరుగల్లు ఘనకీర్తిని ప్రపంచానికి మరోసారి చాటిచెబుతాయని తెలిపారు. నేటి యువత చెడు సావాసాలకు లోనై తమ భవిష్యత్తును నష్టపోతున్న తరుణంలో ఇతిహాసాలు, కళలు, సంప్రదాయాలు, సంస్కారం వారిలో మంచి విలువలను పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. తల్లిదండ్రులు పురాణాలు, చరిత్ర, ప్రాచీన కళల గొప్పతనాన్ని భావితరాలకు పరిచయం చేయాలని సూచించారు.

### లి పి లేని 103 రకాల కళలపై ఆవేదన

స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు గడిచినా తెలంగాణలో లిపి లేని 103 రకాల కళలపై ఆధారపడి కళాకారులు జీవనం సాగిస్తున్నారని ఈగ మల్లేశం తెలిపారు. వారి కళలను, జీవనోపాధిని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రత్యేక చర్యలు తీసుకుని కళాకారులకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమాన్ని జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో జడల శివ నిర్వహించగా, జనగాం రాము వ్యాఖ్యాతగా వ్యవహరించారు. డా. హరిప్రియా హరినాథ్, శంకర్ సారంగపాణి శిష్యులు, సింగర్ శ్యామ్, ప్రసాద్, సురేందర్, ఇమ్మానుయేల్, మున్నా, తోట రవి, రంగనాథ్, చంద్రశేఖర్, బుజంగారావు, శిఖ, చి. రోజారాణి, బిక్షపతి, శ్రీకాంత్, మురళి మధు, కాజీపేట ప్రభాకర్, చిరంజీవి, ప్రవీణ్, మామిండ్ల లక్ష్మణ్, కరిముల సంపత్‌రావు, సంపత్ యాదవ్, రవీందర్‌రెడ్డి, జూలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి జానపద, ఒగ్గు, చిందు, యక్షగానం, భగవత, శాస్త్రీయ కళాకారులు పాల్గొని తమ కళలను ప్రదర్శించారు.



## ఆదివాసి నాయకుల అరెస్టు అప్రజాస్వామీకం

- ఇల్లందులో ఆదివాసీ సంఘాల ఆందోళన
- ఏకలవ్య పాఠశాలలో వివక్షపై విచారణ జరపాలి
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- జేఏసీ తొమ్మిది ఆదివాసీ సంఘాల సంక్షేమ పరిషత్ చైర్మన్ చుంచు రామకృష్ణ



**ఇల్లందు ప్రతినిధి, ఆగస్టు 22 (తరంగాలు):** ఆదివాసి నాయకుల అరెస్టు అప్రజాస్వామీకం అని చుంచు రామకృష్ణ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ తొమ్మిది ఆదివాసీ సంఘాల సంక్షేమ పరిషత్ చైర్మన్ చుంచు రామకృష్ణ మాట్లాడారు. ఏకలవ్య మోడల్ స్కూల్‌లో మూడు రోజులుగా రెండు సామాజిక వర్గాల మధ్య నెలకొన్న విభేదాల నేపథ్యంలో నిరసనలు జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోకుండా, తమను అరెస్టు చేయడం సరికాదని అన్నారు. పాఠశాలలో అన్ని సంస్కృతులు, సంప్రదాయాలను గౌరవిస్తూ విద్యార్థులకు బోధించాల్సిన ఉపాధ్యాయులే జాతి వివక్షకు పాల్పడుతూ ఒక సామాజిక వర్గానికి సంబంధించిన వేడుక నిర్వహించడంపై ఆదివాసీ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను పట్టించుకోని అధికారుల వైఖరి వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. పాఠశాలలో ఆహారం విషయంలో కూడా ఆదివాసీలకు ఒక విధంగా, మరో సామాజిక వర్గానికి మరో విధంగా అందిస్తున్నారని, అక్కడ పనిచేస్తున్న ఆదివాసీ ఉపాధ్యాయుల పట్ల కూడా వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. తీజ్ పండుగ వేడుకలను ఒక రోజుకు బదులుగా ఐదు రోజుల పాటు నిర్వహించడంపై స్థానిక సర్పంచ్ రాధా అభ్యంతరం వ్యక్తం చేశారని తెలిపారు. ఆదివాసీ విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సీతక్కతో పాటు ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు పాఠశాలను సందర్శించి సమస్యను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చుంచు రామకృష్ణ డిమాండ్ చేశారు.



# ఎండింగ్ కేసుల సత్వర పరిష్కారం -- కోర్టు శిక్షల శాతం పెంపే

## లక్ష్యంగా న్యాయ, పోలీసు శాఖల సమన్వయ సమావేశం


- న్యాయ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సత్వర న్యాయం అందించాలి
- జిల్లా జడ్జి పి. వసంత్.



**నల్గొండ– ఆగస్టు22, తరంగాలు :** నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను సత్వరంగా పరిష్కరించడం, నేరస్థులకు శిక్షలు పడే విధంగా పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించడం, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను వేగవంతం చేయడం, కోర్టు శిక్షల శాతాన్ని మరింత పెంచడమే లక్ష్యంగా జిల్లా న్యాయశాఖ, జిల్లా పరిపాలన, పోలీసు శాఖల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లా జడ్జి పి. వసంత్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్రైమ్ కేసులు, ప్రాక్టికల్ కేసులు, అండర్ ట్రయల్ కేసులు, పరారీ నిందితుల కేసులు, ఎన్‌బీడబ్ల్యూ కేసులు తదితర కేసులపై సమగ్రంగా సమీక్షించారు. కేసుల దర్యాప్తు పురోగతి, కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల పరిస్థితి, నిందితుల హాజరు, ఎన్‌బీడబ్ల్యూ అమలు, సాక్షుల హాజరు, కేసు డైరీలు, చార్జ్‌షీట్లు, కోర్టు విచారణకు అవసరమైన ఆధారాల సమర్పణ తదితర అంశాలపై అధికారులు వివరాలు అందించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, ప్రతి కేసుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మాట్లాడుతూ, కేసుల దర్యాప్తు ప్రారంభ దశ నుంచే పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయశాఖ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కోర్టుల్లో కేసుల విచారణ వేగవంతమయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కోర్టుల్లో కేసుల విచారణ సందర్భంగా తలెత్తుతున్న సాంకేతిక, న్యాయపరమైన, పరిపాలనా సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పరిష్కరించుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ఎన్‌బీడబ్ల్యూ కేసుల్లో పరారీ నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అండర్ ట్రయల్ కేసుల విచారణలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ఇటీవల సంచలనం సృష్టించిన కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపా రెడ్డి హత్య కేసును జిల్లా పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్టు చేయడంపై జిల్లా జడ్జి పి. వసంత్ పోలీసులను అభినందించారు. సుమారు 40 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, శాస్త్రీయ దర్యాప్తు, సాంకేతిక ఆధారాల సహాయంతో కేసును ఛేదించిన పోలీసుల పనితీరును ఆయన ప్రశంసించారు. గతంలో మహబూబాబాద్ జిల్లాలో కూడా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కీలక కేసులను సమర్థవంతంగా ఛేదించడంలో మంచి ఫలితాలు సాధించారని జిల్లా జడ్జి పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, న్యాయ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి పి. వసంత్ సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా అన్ని శాఖలు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ జడ్జి కే. కవిత, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్, డీఎస్పీలు, సీఐలు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ అధికారులు, న్యాయశాఖ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## భూగర్భజలాల వృద్ధికి నీటికుంటలే మార్గం

- కూసుమంచి మండలంలో
- నీటికుంటల పరిశీలనలో కలెక్టర్ దివాకర టీఎస్
- రైతులంతా తమ భూమిలో ఏర్పాటు చేసుకోవాలి
- ప్రస్తుత పరిస్థితులు ప్రతికూలమైనవి..
- అందరి సహకారంతో ముందుకెళ్లాలి..



**పాలేరు ఆర్సీ, ఆగస్టు 22 (తరంగాలు) :** రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు (ఫారం పాండ్లు) భూగర్భ జలాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. శనివారం కూసుమంచి మండల కేంద్రానికి చెందిన రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రధాన రహదారి నుంచి సుమారు 600 మీటర్ల మేర డొంక రహదారిలో నడుచుకుంటూ వెళ్లి నీటి కుంట నిర్మాణ పనులను పరిశీలించారు. నీటి కుంటల నిర్మాణం వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు, ఆ నీరు భూమిలోకి ఇంకి సమీపంలోని బోర్లు, బావుల్లో భూగర్భ జలమట్టం పెరగడానికి అవకాశం ఉంటుందని రైతులకు వివరించారు. అదేవిధంగా నీటి నిల్వలు పెరగడం వల్ల భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ పొలాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నీటి కుంట నిర్మాణం, పనుల పురోగతి, రైతులకు కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, రైతులకు ఉపయోగపడే విధంగా పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహసీల్దార్ డీ సైదులు, కూసుమంచి ఏడీఏ, కూసుమంచి సర్పంచ్ కొండ క్రిష్ణవేణి,ఉ మహిపాల్, కూసుమంచి మండల వ్యవసాయాధికారిణి వాణి, ఎపిఓ, ఇసి, ఎఈవో, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత టీఏ లు రైతులు, నీటి కుంటల నిర్మాణానికి సంబంధించిన సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

• యు.పి.హెచ్.సి. కాశీబుగ్గను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి



**వరంగల్, ఆగస్టు 22 (తరంగాలు ప్రతినిధి):** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందేలా వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బి. రాజా రెడ్డి సూచించారు. శనివారం యు.పి. హెచ్.సి. కాశీబుగ్గను ఆయన తనిఖీ చేసి ఆసుపత్రిలోని వివిధ రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, మాతా శిశు ఆరోగ్య సేవలు, ఇమ్యునైజేషన్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, రికార్డుల నిర్వహణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని రికార్డులు, రిపోర్టులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని, ఆరోగ్య కార్యక్రమాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

### ప్రతి చిన్నారికి పూర్తి టీకాలు అందేలా చర్యలు

అనంతరం వివేకానంద కాలనీలో నిర్వహిస్తున్న ఔట్‌రీచ్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ పరిశీలించారు. డ్రాప్అవుట్, లెఫ్ట్అవుట్ పిల్లలు లేకుండా ప్రతి అర్హత కలిగిన చిన్నారికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు డ్యూ లిస్ట్ ఆధారంగా పిల్లలను గుర్తించి ఇమ్యునైజేషన్ కేంద్రాలకు మొబిలైజ్ చేయాలని, తల్లిదండ్రులకు టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి అర్హత కలిగిన చిన్నారికి పూర్తి స్థాయిలో టీకాలు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యు.పి. హెచ్.సి. వైద్యాధికారి డా. కిరణ్ కుమార్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## వరంగల్ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ గా జన్ను గణేష్



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 22,తరంగాలు :** కిల వరంగల్ మండలం నక్కలపెల్లిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం లో ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్‌గా జన్ను గణేష్‌ను నియమించారు. మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఈ నియామకాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. రాబోయే రోజుల్లో ఉన్నతమైన ప్రణాళికలను రూపొందించి దళితుల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. దళితుల్లో ఐక్యత, చైతన్యం తీసుకురావడానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ నెల చివర్లో దళిత ఐక్యత మహాసభలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి దళితుడు చైతన్యవంతమై ఐగ్రేవచారి మైదానంలో నిర్వహించే దళిత సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ జన్ను గణేష్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం రాబోయే రోజుల్లో మరింత కృషి చేస్తానని అన్నారు. వెనుకబడిన వర్గాలను బలోపేతం చేసి, దళిత జాతి ఆత్మగౌరవంతో నిలబడే విధంగా అవసరమైన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నియమ నిష్టలతో, కఠిన శ్రమతో ముందుకు సాగుతానని జన్ను గణేష్ అన్నారు. తన నియామకాన్ని పురస్కరించుకుని కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించిన కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## మృతుని కుటుంబానికి పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శ ఆర్థిక సహాయం



**రాయపర్తి, ఆగస్టు 22, తరంగాలు** :మృతుని కుటుంబాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి,ఆర్థిక సహాయం అందజేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికేడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు తోటకూరి సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్,బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి సోమయ్య చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తరఫున రూ. 3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, సంధి దేవేందర్‌రెడ్డి, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మెర వీరాస్వామి, మాజీ సర్పంచ్ చిన్నల రాజబాబు, మాజీ ఎంపీటీసీ బండి రాజబాబు, పార్టీ ముఖ్య నాయకులు సుధాకర్, అంజాద్ పాషా, మంగిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

## చిరు సినిమాకు కాకాగా టైటిల్

**బడర్త్‌డే సందర్భంగా టైటిల్ రిలీజ్**



అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధానపాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీమ్ అప్‌డేట్ ఇచ్చింది. సినిమా టైటిల్‌ను 'కాకా'గా ఖరారు చేస్తూ ఓ వీడియోను షేర్ చేసింది. ఇందులో చిరం జీవి మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. అక్వా సంస్థలో ఉద్యోగిగా చిరంజీవి సత్యం అనే పాత్రలో నటిస్తున్నారు. 'ఇది సత్యం మాట.. ఇంకా డౌటా' అనే డైలాగు ఆయన పాత్ర స్వభావాన్ని తెలుపుతోంది. ఇందులో కనిపించిన 'ఐ లవ్ డాడీ' అనే కీ చైన్‌కు.. ఫ్లాష్ బ్యాక్‌లో ఆయనకు తండ్రితో అనుబంధం ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. టైటిల్ రివీల్ అనంతరం యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో గన్స్ పేలుస్తూ చిరంజీవి ఇచ్చిన మాస్ పోజు.. మెగా ఫ్యాన్స్‌కు వింటేజ్ చిరును గుర్తుచేస్తోంది. ఇక 'కాకా' సినిమా సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది

## చిరంజీవి పుట్టినరోజు..సోషల్ మీడియాలో బన్నీ విషెస్


మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా తెలుగు చిత్రసీమ అంతా పండగ వాతావరణంలో మునిగిపోయింది. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా మెగాస్టార్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చేసిన ఓ ప్రత్యేక ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఆయన ఉపయోగించిన కెఎకెఎ హ్యాష్‌ట్యాగ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ అల్లు అర్జున్, 'మన ఏకైక మెగాస్టార్ చిరంజీవి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆయన మా అందరికీ ఎంతో అండగా నిలిచారు. మాలో ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తూ, మమ్మల్ని ముందుకు నడిపించారు' అంటూ తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. అయితే ఈ ట్వీట్ చివరలో పెట్టిన పదాలే ఇప్పుడు నెటిజన్లలో ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి. అల్లు అర్జున్ ఈ హ్యాష్‌ట్యాగ్‌కు నేరుగా అర్థం చెప్పకుండా ఎజఐజఐ అని పేర్కొన్నారు. అల్లు అర్జున్ గతంలో ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్యను గుర్తు చేసుకుంటే ఈ హ్యాష్‌ట్యాగ్ వెనుక ఉన్న భావం సులభంగా అర్థమవుతోంది. 'కట్టే కాలే వరకు చిరంజీవి ఫ్యాన్' అంటూ బన్నీ గతంలో చెప్పిన మాట అభిమానులకు ఇప్పటికీ గుర్తుంది. అప్పట్లో ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. ఇప్పుడు అదే మాటను షార్ట్ ఫార్మ్‌లో ఉపయోగిస్తూ చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నారని అభిమానులు భావిస్తున్నారు.

## వివాహబంధంతో ఒక్కటైన అర్జున్ రాంపాల్,గాబ్రియెల్లా

బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ మరోసారి పెళ్లి బంధంలోకి అడుగుపెట్టారు. 'ధురంధర్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో విలన్‌గా మరింత గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ రాంపాల్.. తన ప్రియురాలు, మోడల్, నటి గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌ను అధికారికంగా వివాహం చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా సహజీవనం చేస్తున్న ఈ జంట తాజాగా తమ బంధానికి అధికారికంగా మూడుముళ్ల బంధంతో ముగింపు పలికింది. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌లు ఉత్తర గోవాలోని మపుసా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నట్లు సమాచారం. సాయంత్రం 4 గంటల సమయంలో ఈ జంట కార్యాలయానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. పెళ్లి సందర్భంగా ఇద్దరూ ఎలాంటి హంగూ ఆర్భాటాలకు వెళ్లకుండా చాలా సింపుల్‌గా సాధారణ దుస్తుల్లో కనిపించారు. రిజిస్టర్ మ్యారేజ్ సమయంలో కుటుంబ సభ్యులు, కొందరు స్నేహితులు, అత్యంత సన్నిహితులు మాత్రమే వారితో ఉన్నట్లు సమాచారం.

## నా నిజమైన హీరో మా అన్నయే

**చిరు బర్త్‌డే సందర్భంగా పవన్ కళ్యాణ్ విషెస్**



మెగాస్టార్‌గా చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రము ఖులు, రాజకీయ నాయకులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ ప్రత్యేక రోజున జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన అన్నయ్య చిరంజీవితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ హృదయాన్ని హత్తుకునే ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. చిన్ననాటి నుంచి చిరంజీవి తనకు కేవలం అన్నయ్య మాత్రమే కాదని, ఎప్పటికీ తన హీరోనే అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. చిరంజీవి కళాశాల చదువుల కోసం నర్సాపూర్ వెళ్లిన రోజులను గుర్తు చేసుకుంటూ, వేసవి సెలవుల్లో ఆయన ఇంటికి రావడం తమ కుటుంబానికి పండగలా ఉండేదని తెలిపారు. తిరిగి చదువుల కోసం వెళ్లిపోయినప్పుడు ఇంట్లో ఒక వెలితి కనిపించేదని, ఆయన తిరిగి వచ్చే వరకు ఆ ఆనందం ఉండేది కాదని భావోద్వేగంగా రాశారు.

తన పాఠశాల రోజుల నుంచే అన్నయ్యపై తనకు ఎంతో గర్వం ఉండేదని పవన్ తెలిపారు. చిరంజీవి ఇంకా హీరో కాకముందే తన దృష్టిలో ఆయన హీరో అని చెప్పారు. పొడవాటి జుట్టు, బెల్‌బాటమ్ ప్యాంట్, కళ్లద్దాలు ధరించి తమ తండ్రి బు÷-లలెట్ బైక్ నడుపుతూ కనిపించే చిరంజీవిని చూసిన క్షణాలు ఇప్పటికీ మర్చిపోలేనివని పేర్కొన్నారు. చిరంజీవి తన కెరీర్ తొలినాళ్లలో సింగపూర్ పర్యటనకు వెళ్లి వచ్చిన సందర్భంగా తమ కోసం తెచ్చిన బహుమతులను కూడా పవన్ గుర్తు చేసుకున్నారు. పెద్ద నీలిరంగు బ్యాగ్‌లో తన కోసం తీసుకొచ్చిన చిన్న లెగో హెలికాప్టర్, రిమోట్ కార్లు, రేసింగ్ ట్రాక్, కామిక్స్, మ్యూజిక్ టేపులు, టేప్ రికార్డర్, పెర్ఫ్యూమ్‌లు వంటి బహుమతులు తన చిన్ననాటి జ్ఞాపకాలలో ప్రత్యేకంగా నిలిచిపోయాయని చెప్పారు. చిరంజీవి ఎప్పుడూ తమ ఇంటికి ఆనందాన్ని, చిరునవ్వులను తీసుకొచ్చేవారని తెలిపారు. దక్షిణాది, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య సాంస్కృతిక వారధిగా చిరంజీవి కీలక పాత్ర పోషించారని పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. సాంకేతికతపై ఆసక్తి, దాతృత్వం, కుటుంబంపై ప్రేమ, నటుడిగా సాధించిన అపారమైన విజయాలు.. కేంద్ర మంత్రిగా నిర్వహించిన బాధ్యతలు.. జాతీయ పురస్కారాలు, పద్మవిభూషణ్ వంటి అత్యున్నత గౌరవాలు అందుకున్నప్పటికీ ఆయనలో పనిచేయాలనే తపన మాత్రం ఎప్పుడూ తగ్గలేదని పేర్కొన్నారు. ఇటీవల ఆరోగ్యపరమైన చికిత్స తర్వాత కూడా చిరంజీవి ఎంతో వేగంగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లకు వెళ్లడం ఆయనలోని అద్భుతమైన శక్తికి నిదర్శనమని పవన్ అన్నారు. 'నగరం ఎప్పుడూ నిద్రపోనట్లే, ఆయన కూడా ఎప్పుడూ విశ్రమించరు. అందుకే ఆయన మా ప్రియమైన మెగాస్టార్.. నాకు మాత్రం ఎప్పటికీ నా ఏకైక హీరో' అంటూ పవన్ తన అన్నయ్యపై ఉన్న ప్రేమను చాటుకున్నారు.

## బౌలింగ్ కూర్పుపై టీమ్ మేనేజ్మెంట్ కసరత్తు

శ్రీలంకతో కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్ కోసం టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్ ఎంపికపై తీవ్ర కసరత్తు జరుగుతోంది. రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ సారాంశ్ జైన్‌ను తీసుకోవాలా వద్దా అనే నిర్ణయం పూర్తిగా పిచ్ స్వభావంపైనే ఆధారపడి ఉంటుందని శ్రీలంక మాజీ క్రికెటర్ రస్సెల్ ఆర్నాల్డ్ వ్యాఖ్యానించాడు. గాలే వేదికగా జరిగిన మొదటి టెస్టులో ఇండియా 165 రన్స్ తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కుల్దీప్ కేవలం ఒక వికెట్ మాత్రమే దక్కించుకున్నాడు. కుల్దీప్ స్థానంలో జట్టులోకి వస్తే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 181 వికెట్లు, 2,223 రన్స్ చేసిన ఇండోర్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్‌కు ఇది డెబ్యూ మ్యాచ్ అవుతుండటం విశేషం. శ్రీలంక జట్టులో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు రాణిస్తున్న నేపథ్యంలో ఆఫ్ స్పిన్నర్‌ను తీసుకోవడం లాజిక్కే అయినా, ప్రాక్టీస్ సెషన్ తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ఆర్నాల్డ్ తెలిపాడు. పిచ్ పొడిగా ఉండి ఆది నుంచే టర్న్ అయ్యే అవకాశం ఉంటే సారాంశ్ జైన్ బెస్ట్ ఆప్షన్ అవుతాడని వ్యాఖ్యానించాడు. ఒకవేళ పిచ్ ఫ్లాట్‌గా ఉండి ఆట సాగుతున్న కొద్దీ నెమ్మదిస్తే మాత్రం ప్రత్యర్థిని బోల్తా కొట్టించడానికి కుల్దీప్ యాదవ్ నైపుణ్యం అవసరమని తెలిపాడు. మరోవైపు శ్రీలంక జట్టు టాప్ ఆర్డర్ వైఫల్యాలతో కొట్టుమిట్టాడుతోంది. గాలే టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగులకే 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి లంక చేతులెత్తేసింది. పాథుమ్ నిస్సాంక, కుసాల్ మెండిస్ గాయాలతో దూరం కాగా, దినేష్ చండిమల్ సైతం కంకషన్ కారణంగా కొలంబో మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదని సమాచారం. టెస్ట్ ఆడే అన్ని దేశాల్లో శ్రీలంక ఓపెనింగ్ భాగస్వామ్యాలు అత్యంత పేలవంగా ఉన్నాయని ఆర్నాల్డ్ గుర్తు చేశాడు. కొత్త బంతి గట్టిగా ఉన్నప్పుడు అనవసర దూకుడు ప్రదర్శించి వికెట్లు సమర్పించుకున్నారని, కామిందు మెండిస్ లాంటి అనుభవజ్ఞుడు కూడా అదే తప్పు చేశాడని నిట్టూర్చాడు. బంతి పాతబడే వరకు క్రీజులో నిలబడితే బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతుందని గుర్తు చేశాడు. కొలంబో మ్యాచ్ కోసం శ్రీలంక జట్టులోనూ మార్పులు ఉండవచ్చని ఆర్నాల్డ్ వ్యాఖ్యానించాడు. ఫాస్ట్ బౌలర్ లాహిరు కుమారను పక్కన పెట్టి ఆఫ్ స్పిన్నర్ రమేష్ మెండిస్‌ను తుది జట్టులోకి తీసుకునే చాన్స్ ఉందని పేర్కొన్నాడు. ఇద్దరు స్పిన్నర్లు చిన్న స్పెల్స్ వేస్తే మరింత తాజాగా, శక్తితో బౌలింగ్ చేయగలుగుతారని ఆర్నాల్డ్ తెలిపాడు. బ్యాటర్లను గాల్లోనే బోల్తా కొట్టించాలంటే పూర్తి ఫిట్‌నెస్‌తో బౌలింగ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. ఇక రెండో టెస్టు ఆదివారం నుంచి కోలంబో వేదికగా ప్రారంభం కానుంది.